

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 17-12-2025 | సంపుటి - 26 | సంచిక -209 | రూ : 4 | పేజీలు: 8


## రేవంత్ రెడ్డి

# ఢిల్లీ పర్యటన..

### కేంద్రమంత్రులతో వరుస భేటీ

- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లను కలిసిన సీఎం
- విజన్ డాక్యుమెంట్‌ను అందజేసిన ముఖ్యమంత్రి
- యంగ్ ఇండియా స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని విజ్ఞప్తి



2లో



2లో

## వక్ఫ్ భూముల

# పరిరక్షణే లక్ష్యం

- తెలంగాణలో వక్ఫ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్న అజారుద్దీన్
- ఉమ్మీద్ పోర్టల్ ఏర్పాటులో సాంకేతిక సమస్యలు తలెత్తాయని వెల్లడి
- మైనార్టీల బడ్జెట్ పెంచేందుకు కృషి చేస్తామన్న మంత్రి

## ఈసారి

# డిగ్రీ వరకు బడిబాట

- సర్కారు పాఠశాలల్లో చదువు చెబితే క్రెడిట్లు
- విద్యాశాఖ పలు కీలక నిర్ణయాలు




2లో

హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచడంపై విద్యాశాఖ దృష్టిసారించింది. ఇప్పటివరకు కేవలం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులే ఆచార్య జయశంకర్ బడిబాట నిర్వహించగా.. ఆ కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకూ విస్తరించనున్నారు. అంటే అధ్యాపకులు సైతం విద్యార్థులను కళాశాలల్లో చేరాలని ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తాజాగా సంబంధించిన షెడ్యూల్‌ను ఖరారు చేయాలని మౌఖికంగా ఆదేశించారు. వివిధ అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి.. కీలక నిర్ణయాలపై ఆదేశాలిచ్చారు.

## ఆస్ట్రేలియా కాల్పుల నిందితుడు

# సాజిద్ హైదరాబాద్ వాడే

- సిడ్నీ బాండీ బీచ్ ఉగ్రదాడి నిందితుడు హైదరాబాదీ
- నిందితుడికి హైదరాబాద్ మూలాలు ఉన్నాయని ధృవీకరించిన డీజీపీ
- 27 ఏళ్ల క్రితం స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లిన సాజిద్
- కుమారుడితో కలిసి దాడి.. ఎదురుకాల్పుల్లో సాజిద్ మృతి



2లో



2లో

## పల్లె పోరు..

# నేటితో ఆఖరు

- మూడో దశ పోలింగ్ నేడే
- 3,752 సర్పంచి, 28,410 వార్డు సభ్యుల పదవులకు పోటీ

## యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌ను

# కలవడం ఆనందదాయకం

- యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆంధ్రప్రదేశ్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చ
- వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణల వంటి అంశాలపై సంప్రదింపులు
- అమెరికా సంస్థలకు ఏపీ నమ్మకమైన, భవిష్యత్-సిద్ధ భాగస్వామి అని స్పష్టం
- భారత్-అమెరికా సంబంధాల్లో తెలుగు డయాస్పోరా పాత్ర కీలకమన్న సీఎం



2లో

## టీటీడీ కీలక నిర్ణయాలు...

# అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు

- తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం
- అర్చకులు, ఇతర సిబ్బంది వేతనాల్లో భారీ పెంపు
- ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయానికి ఆమోదం
- టీటీడీ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాసులు, మధ్యాహ్న భోజన పథకం
- రథాలు, ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో దివ్య వృక్షాల పెంపకం



2లో

## 15 రోజుల్లో వివరణ ఇవ్వండి




2లో

- భారతి సిమెంట్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం నోటీసులు

# యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌ను కలవడం ఆనందదాయకం



ఆంధ్రప్రదేశ్, డిసెంబర్ 16 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్, అమెరికా మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఇరువురి మధ్య పరస్పర ఆసక్తి ఉన్న పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాల బలోపేతం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. "యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌ను కలవడం ఆనందదాయకం. బలమైన వ్యాపార పర్యావరణ వ్యవస్థ, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన చైతన్యవంతమైన తెలుగు డయాస్పోరా కారణంగా భారత్ అమెరికా సంబంధాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా వ్యాపార సంస్థలకు, విద్యాసంస్థలకు ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ నమ్మకమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే భాగస్వామిగా కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశం ఇరుపక్షాల మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఢిల్లీలో సోనియాను కలిసి విజన్ డాక్యుమెంట్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ, డిసెంబర్ 16 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్పర్సన్ సోనియా గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆమెకు అందజేసి, రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి సోనియా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. ఇటీవల డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' వివరాలను కూడా ఆమెకు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధిపై రేవంత్ రెడ్డి దార్శనికతను సోనియా గాంధీ అభినందించారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ, ముఖ్యమంత్రికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఏమిటీ విజన్ డాక్యుమెంట్?**

'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ప్రకారం, రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకోవాలని నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) అనే మూడు ప్రత్యేక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌కు సోనియా గాంధీ సందేశం పంపుతూ, తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఈ సదస్సు ఒక పెద్ద ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన.. కేంద్రమంత్రులతో వరుస భేటీ

ఢిల్లీ, డిసెంబర్ 16 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశారు. రెండు రోజుల క్రితం మెస్సీతో మ్యాచ్ అనంతరం ఆయన హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రెండు రోజులుగా ఆయన ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం ఆయన కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి కోరారు. అనంతరం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు.

## ఈసారి డిగ్రీ వరకు బడిబాట

హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచడంపై విద్యాశాఖ దృష్టిసారించింది. ఇప్పటివరకు కేవలం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులే ఆచార్య జయశంకర్ బడిబాట నిర్వహించగా.. ఆ కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకూ విస్తరించనున్నారు. అంటే అధ్యాపకులు సైతం విద్యార్థులను కళాశాలల్లో చేరాలని ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తాజాగా అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఖరారు చేయాలని మౌఖికంగా ఆదేశించారు. వివిధ అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి.. కీలక నిర్ణయాలపై ఆదేశాలిచ్చారు.

**గురుకులాల్లో సీట్లు పొందేందుకు 'సాధన'...**

రాష్ట్రవ్యాప్తంగా 637 ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు వచ్చే ఫిబ్రవరి 22న టీజీసెట్ పేరిట ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అంటే 4వ తరగతి విద్యార్థులు పోటీ పడాల్సి ఉంటుంది. గురుకులాల్లో అన్ని సీట్లు భర్తీ కావడం లేదు. మొత్తం సీట్లు నిండటంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఎక్కువ సీట్లు సాధించాలన్న లక్ష్యంతో వారికి నమూనా పరీక్షలు (మాక్ టెస్టులు) నిర్వహించనున్నారు. బిట్ బ్యాంకుతో సాధన పేరిట స్టడీ మెటీరియల్ రూపొందించనున్నారు. ప్రతి పాఠశాలకు ఒకటి తెలుగు, మరొకటి ఆంగ్ల మాధ్యమానికి సంబంధించి మొత్తం 54,346 పుస్తకాలను త్వరలో పంపిస్తారు. గురుకులాల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న పిల్లలకు ఉపాధ్యాయులు కోచింగ్ ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1.60 లక్షల మంది నాలుగో తరగతి చదువుతున్నారు.

## పల్లె పోరు.. నేటితో ఆఖరు

హైదరాబాద్, డిసెంబర్ 16 : హైదరాబాద్: తెలంగాణలో గ్రామ పంచాయతీల ఎన్నికల సమరం బుధవారంతో ముగియనుంది. ఇప్పటికే తొలి, మలి దశ ఎన్నికలు జరగగా... బుధవారం మూడో దశ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమయింది. మొత్తం 26,01,861 మంది పురుషులు, 27,04,394 మంది స్త్రీలు, 140 మంది ఇతరులతో కలిపి మొత్తం 53,06,395 మంది 36,452 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 43,856 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా... అందులో 11 సర్పంచ్ పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు జీపీలలో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 3,752 సర్పంచ్ పదవులకు 12,652 మంది పోటీ చేస్తున్నారు. 36,452 వార్డుల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కాగా 116కి నామినేషన్లు దాఖలు కాలేదు. 7,908 ఏకగ్రీవమయ్యాయి. 18 వార్డులలో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 28,410 వార్డులకు 75,725 మంది బరిలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణలో 4,502 మంది రిటర్నింగ్ అధికారులు, 77,618 మంది పోలింగ్ సిబ్బంది పాల్గొననున్నారు. 2,489 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. పోలింగ్ నేపథ్యంలో పోలీసులు పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. 36,165 మందిని బైండోవర్ చేశారు. నగదు, ఆభరణాలు, మద్యం ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.2.09 కోట్ల నగదు, రూ.3.81 కోట్ల మద్యం, 2.28 కోట్ల మత్తుపదార్థాలు, రూ.12.20 లక్షల ఆభరణాలు, రూ.78.33 లక్షల ఇతర సామగ్రి ఉన్నాయి. పటిష్ఠ బందోబస్తు. తుది దశ ఎన్నికలు కావడంతో రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. పోటాపోటీగా అన్ని పార్టీలు తమ మద్దతుదారుల

## ఆస్ట్రేలియా కాల్పుల నిందితుడు సాజిద్ హైదరాబాద్ వాడే

హైదరాబాద్, డిసెంబర్ 16 : ఆస్ట్రేలియాలోని సిడ్నీలో తీవ్ర కలకలం రేపిన బాండీ బీచ్ ఉగ్రదాడికి హైదరాబాద్‌తో సంబంధాలున్నట్లు తేలింది. ఈ దాడిలో ప్రధాన నిందితుడైన సాజిద్ అక్రమ్ (50) హైదరాబాద్‌కు చెందినవాడేనని తెలంగాణ డీజీపీ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. దాదాపు 27 ఏళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన సాజిద్, అక్కడ ఉగ్రవాదిగా మారి ఈ ఘాతుకానికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సిడ్నీలోని ప్రఖ్యాత బాండీ బీచ్‌లో యూదులు హనుక్కా ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ అక్రమ్ (24) విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 15 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో సాజిద్ అక్రమ్ హతమవగా, అతని కుమారుడు నవీద్‌ను అధికారులు అరెస్టు చేశారు. ఇది ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ప్రేరేపిత దాడి అని ఆస్ట్రేలియా అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌లో బీకామ్ పూర్తి చేశాడు. సుమారు 27 ఏళ్ల క్రితం, 1998లో స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడే యూరప్‌కు చెందిన వెనెరా గ్రోసో అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు నవీద్, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఆస్ట్రేలియా పౌరసత్వం కలిగి ఉన్నారు. ఆస్ట్రేలియాకు వలస వెళ్లినప్పటికీ, సాజిద్ ఇప్పటికీ హైదరాబాద్ నుంచి జారీ చేసిన భారత పాస్‌పోర్టునే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఆస్ట్రేలియా వెళ్లిన తర్వాత కుటుంబ, ఆస్తి వ్యవహారాల నిమిత్తం సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చినట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. అయితే, హైదరాబాద్‌లో అతనికి ఎలాంటి నేర చరిత్ర లేదని స్పష్టం చేసింది. అతని కుటుంబ సభ్యులు కూడా సాజిద్‌కు ఉగ్రవాద సంస్థలతో ఎటువంటి సంబంధాలు లేవని చెబుతున్నారు. ఈ ఘటనను ఆస్ట్రేలియా ప్రభుత్వం యూదు వ్యతిరేక ఉగ్రవాద చర్యగా పరిగణిస్తోంది. అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సహకారంతో ఈ దాడి వెనుక ఉన్న పూర్తి వివరాలను రాబట్టేందుకు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో చదువుకున్న వ్యక్తి ఇలా అంతర్జాతీయ ఉగ్రవాదిగా మారడంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## వక్ఫ్ భూముల పరిరక్షణే లక్ష్యం..

హైదరాబాద్, డిసెంబర్ 16 : తెలంగాణలో వక్ఫ్ భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. భూముల వివరాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా 'ఉమ్మీద్ పోర్టల్' ఏర్పాటు చేస్తున్నామని, అయితే గత 10 రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయని తెలిపారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 63,180 ఎకరాల వక్ఫ్ ఆస్తులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 16,700 ఎకరాల వివరాలను మాత్రమే పోర్టల్‌లో నమోదు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంకా 46 వేల ఎకరాలకు పైగా భూముల వివరాలు నమోదు కావాల్సి ఉన్నాయన్నారు. తప్పుడు పత్రాలతో భూములను అప్‌లోడ్ చేస్తే వాటిని తిరస్కరిస్తామని హెచ్చరించారు. పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు, యాప్ సరిగా పనిచేయకపోవడం వల్ల భూముల నమోదుకు మరింత సమయం ఇవ్వాలని కోరుతూ ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరించారు. ఇటీవల గురుకులాల్లో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను మంత్రి దురదృష్టకరమని అభివర్ణించారు. ఈ ఘటనలపై విచారణకు ఆదేశించామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యార్థులకు భోజనం అందించడానికి 30 నిమిషాల ముందే అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. రాబోయే బడ్జెట్‌లో మైనార్టీల కోసం నిధులు పెంచేందుకు కృషి చేస్తున్నామని, గురుకులాల్లో కేవలం 40 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని అజారుద్దీన్ పేర్కొన్నారు.

## టీటీడీ కీలక నిర్ణయాలు... అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు

తిరుమల, డిసెంబర్ 16 : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి భక్తుల సౌకర్యం, సంస్థాగత బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని, ముంబైలోని బాంద్రాలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం తిరుపతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ప్లానింగ్, ఆర్కిటెక్ట్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా, ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లోని ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలప కోసం పలమనేరులో 100 ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదముద్ర వేశారు.

**ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట**

ఈ సమావేశంలో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62 మంది అర్చకులు, పరిచారకులు, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్ల వేతనాలను గణనీయంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం అర్చకుల వేతనాన్ని రూ.25 వేల నుంచి రూ.45 వేలకు, పరిచారకులకు రూ.23,140 నుంచి రూ.30,000కు పెంచారు. పోటు వర్కర్లకు, ప్రసాదం పంపిణీ సిబ్బందికి కూడా వేతనాన్ని రూ.30,000కు పెంచుతూ తీర్మానించారు. శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవ పోస్టు భర్తీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రోత్సాహం**

విద్యా, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకమండలి ఆమోదం తెలిపింది. తిరుపతి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాల కోసం అదనంగా రూ.48 కోట్లు కేటాయించారు. టీటీడీ ఆధ్వర్యంలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటుకు, ఎస్వీ జూనియర్, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలల్లో డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టుల భర్తీకి, శ్రీవారి పోటులో 18 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని తీర్మానించారు. తిరుమలలోని రహదారులు, కూడళ్లకు వైష్ణవ పురాణాలు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలను పెట్టేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. తలకోనలోని సిద్దేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.14.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయాలన్నీ భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, టీటీడీని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడతాయని ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

## ఆస్ట్రేలియా తరహాలో భారత్ లోనూ కాల్పులు జరిగే అవకాశం..

* **ఆస్ట్రేలియాలోని బాండీ బీచ్‌లో తండ్రీకొడుకుల కాల్పులు, 16 మంది మృతి**
* **ఐసిస్ భావజాలంతోనే ఈ దాడికి పాల్పడినట్లు నిర్ధారణ**
* **భారత్‌లో న్యూ ఇయర్ వేడుకల లక్ష్యంగా దాడులు జరగొచ్చని నిఘా వర్గాల హెచ్చరిక**
* **దాడికి పాల్పడిన ఉగ్రవాదులు భారత పాస్‌పోర్టులు వాడినట్లు వెల్లడి**
* **గోవా వంటి పర్యాటక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని సూచన**



ఢిల్లీ, డిసెంబర్ 16 : ఆస్ట్రేలియాలోని సిడ్నీ బాండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడి భారత్‌లో కలకలం రేపింది. ఈ దాడి నేపథ్యంలో దేశంలోని నిఘా వర్గాలు అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న తరుణంలో ఐసిస్ ప్రేరేపిత ఉగ్రవాదులు పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవచ్చని హెచ్చరించాయి. ఆస్ట్రేలియాలో హనుక్కా పండగ మొదటి రోజున, 50 ఏళ్ల తండ్రి, 24 ఏళ్ల కొడుకు జరిపిన కాల్పుల్లో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. నిందితులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్‌లుగా గుర్తించారు. వీరు ఐసిస్ తీవ్రవాద భావజాలంతో ప్రభావితమయ్యారని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ స్వయంగా ధృవీకరించారు. విచారణలో ఈ తండ్రీకొడుకులు భారత పాస్‌పోర్టులపై ప్రయాణించినట్లు, గత నెల ఫిలిప్పీన్స్‌ను సందర్శించినట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత నిఘా సంస్థలు (ఐబీ) భద్రతను కట్టుదిట్టం చేయాలని రాష్ట్రాలకు సూచించాయి. సిడ్నీ దాడిని ఒక ఉదాహరణగా చూపి, ఐసిస్ అనుబంధ గ్రూపులు ఆన్‌లైన్‌లో యువతను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ర్యాడికలైజేషన్ డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని కూడా ఉగ్రవాద సంస్థలు నియామకాలకు ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. నూతన సంవత్సర వేడుకలకు భారీగా జనం తరలివచ్చే గోవా వంటి రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిఘా వర్గాలు హెచ్చరించాయి. గతంలో ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేసిన జైషే మహ్మద్ ప్రేరేపిత మాడ్యూల్ ఢిల్లీలో దాడికి పాల్పడిన విషయాన్ని అధికారులు గుర్తుచేస్తున్నారు. పోలీసులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఉగ్రవాదులు దాడులకు తెగబడే ప్రమాదం ఉందని, అందుకే అప్రమత్తత అత్యవసరమని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

# ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రగతినగర్ లో ప్రహార్ మహాయజ్ఞం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : 1971లో జరిగిన యుద్ధంలో భారత త్రివిధ దళాలు పాకిస్తాన్ సైన్యం పై విరుచుకుపడి చరిత్రాత్మక విజయం సాధించాయి. ఆ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబర్ 16న దేశమంతా 'విజయ్ దివస్' నిర్వహించుకుంటామని బీజేపీ నేత డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు అన్నారు. మంగళవారం ప్రగతి నగర్ లోని సంఘ శాఖలకు చెందిన స్వయంసేవకులు 10 వేల ప్రహార్లతో వీర సైనికులకు జోహారులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు తూర్పు, ఇటు పశ్చిమ సరిహద్దుల్లో వీరోచిత పోరాటం చేసి భరతమాతకు విజయ తిలకం దిద్దిన వీర సైనికుల గౌరవార్థం, నాటి విజయగాథను నేటి తరానికి అందించడం కోసం ఆర్ఎస్ఎస్ స్వయంస్వకులు 'అఖిల భారత ప్రహార్ మహాయజ్ఞం' పేరిట ప్రహార్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ విజయ్ దివస్ ఉత్సవంలో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, లక్ష్మీ రామారావు, సత్య కాటేపల్లి, శిష్టా రామకిశోర్, డాక్టర్ వెంకన్న, నవీన్ చందర్, శివకుమార్ గుప్తా, హరీశ్వర్, శివ, వెంకట్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలి

* బీఆర్ఎస్ నాయకుల వినతి




బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసీలో విలీనం చేసి డివిజన్‌గా మార్చిన పరిస్థితిలో నాలుగు డివిజన్లను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు ఉప్పరి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టిఆర్ఎస్ నాయకులు చినింగళ్ళ సంతోష్, చంటి శివ, దానగల లక్ష్మణ్‌ల. రామగుల్ల శంకర్ కలిసి బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల విభజనకు సంబంధించి నూతన డివిజన్లపై ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో బోడుప్పల్‌లో నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలన్నారు. బోడుప్పల్ ప్రాంతం జనాభా పరంగా విస్తృతంగా ఉండటంతో పాటు, అభివృద్ధి అవసరాలు అధికంగా ఉన్నాయని వారు తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన, సౌకర్యాల అందుబాటు కోసం నాలుగు డివిజన్లుగా విభజించడం అవసరమని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

# డివిజన్ల పునర్విభజనలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

* వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : జీహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల ప్రకటించిన డివిజన్ల పునర్విభజనలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వి.కర్ణన్ ని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన కార్పొరేటర్ వార్డుల పునర్విభజనలో అవసరమైన మార్పులు, చేర్పులపై పరిష్కారంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఎమ్మెల్యే ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఖాజీపల్లి వాసులు



జిన్నారం, ప్రజాస్ఫూర్తి: జిన్నారం మండలం ఖాజిపల్లి గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో ఫంక్షన్ హాల్ మంజూరి చేసిన ఎమ్మెల్యేకు ఖాజీపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే ను కలిసి సన్మానించారు. 2కోట్ల 80 లక్షల రూపాయలతో ఫంక్షన్ హాల్ నిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే చేత ఈ నెల 26 భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కుంచల ప్రభాకర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, మాజీ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్ట బందోబస్తు

* పోలింగ్, కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
* జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా 730 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రూట్ మొబైల్స్ 33 జోనల్ టీమ్స్ 06 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), క్విక్ రియాక్షన్ టీమ్స్ 04 , స్ట్రయికింగ్ ఫోర్స్ 02 ఏర్పాటు చేసి మొత్తం 730 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని, రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద, రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

**ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవ ర్యాలీలు నిషేధం...**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం,గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు,సభలు,బైక్ ర్యాలీలు,డీజె లు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని,ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు.

# కర్ల రాజేష్ మృతికి కారకులైన పోలీసుల మీద చర్యలు తీసుకోవాలి

* డీజీపీకి మందకృష్ణ మాదిగ వినతి



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : సూర్యాపేట జిల్లా కోదాడలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన కర్ల రాజేష్‌ను ఏ ఫిర్యాదు లేకుండానే చట్టవిరుద్ధంగా కస్టడీలోకి తీసుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి అతని మృతికి కారకులైన చిలుకూరు ఎస్సై , కోదాడ రూరల్ సీఐ లతో పాటు పోలీసు సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు, 'పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ మంగళవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి ని డీజీపీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మృతుడి తల్లి కర్ల లలితమ్మతో కలిసి కర్ల రాజేష్ మృతికి సంబంధించిన సంపూర్ణ ఆధారాలు,సాక్ష్యాలు, సంబంధిత పత్రాలతో కూడిన మెమోరాండంను అందజేశారు.ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించిన వాస్తవాలు, బాధిత కుటుంబం ఎదుర్కొన్న అన్యాయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. కేసును నిష్పక్షపాతంగా, వేగవంతంగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.డీజీపి ని కలిసిన అనంతరం మంద కృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే అత్యంత అరుదైన కస్టడీ డెత్ కర్ల రాజేష్ ది కావడం గమనార్హం అన్నారు. ఇప్పటివరకు జరిగిన లాకప్ డెత్ లన్ని బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత లేదా ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత నిందితులను అదుపులో తీసుకొని పోలీసులు విచారిస్తున్న సందర్భంలో జరిగిన హింసల వల్ల జరిగాయని అన్నారు .ఏ ఫిర్యాదు లేకుండా , ఏ కారణం లేకుండా ఏ ఎఫ్ఐఆర్ లేకుండానే చట్ట విరుద్ధంగా తమ కస్టడీలోకి తీసుకొని తీవ్రంగా చిత్రహింసలు పెట్టి అమాయకుడి మృతికి పోలీసులు కారకులైన సంఘటన మాత్రం కేవలం కర్ల రాజేశ్ ది మాత్రమే అన్నారు.నవంబర్ 4నుండి నవంబర్ 9 వరకు కర్ల రాజేష్ ను పోలీసులు చట్టవిరుద్ధంగా కస్టడీలో ఉంచుకున్నారని అన్నారు. చట్టవిరుద్ధమైన కస్టడీ, చట్ట విరుద్ధమైన చిత్రహింసలు రాజేష్ మరణానికి ప్రధాన కారణం అని అన్నారు.ఒకవేళ పోలీసులు చెబుతున్నట్లుగా సీఎమ్మార్ఎఫ్ డబ్బుల విషయంలో రాజేష్‌ను నవంబర్ 9వ తేదీననే అరెస్టు చేస్తే నవంబర్ 4 వ తేదీన రాజేష్‌ను తన ఇంటికి వచ్చి తీసుకెళ్లిన కానిస్టేబుల్ రామారావు , హోంగార్డు నరసింహారావు ఎవరు అని ప్రశ్నించారు.నవంబర్ 5 వ తేదీన అరవింద్ అనే కానిస్టేబుల్ రాజేష్ ను తన బైక్ పైన ఎక్కించుకొని ఆయన పనిచేస్తున్న పెట్రోల్ బంక్ వద్దకు తీసుకెళ్లింది నిజం కాదా అని ప్రశ్నించారు.5 రోజుల పాటు కోదాడ రూరల్ , చిలుకూరుపోలీస్ స్టేషన్ వద్దకు రాజేష్ తల్లి భోజనం తీసుకొచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆ భోజనాన్ని పోలీసులు లోపలికి తీసుకెళ్లి లాకప్ లో ఉన్న రాజేష్ కు ఇచ్చింది నిజం కాదా? అన్నారు. పోలీసుల కస్టడీలో రాజేష్ లేకపోతే ఆ భోజనం ఎవరికి పెట్టారు ? తన తల్లి రాజేష్ ను చూపించమంటే పోలీసులు నిరాకరించింది నిజం కాదా అని ప్రశ్నించారు? నవంబర్ 8 వ తేదీన బంధువులు ఒత్తిడి చేస్తే రాజేష్ తల్లిని లోపలికి తీసుకెళ్లి లాకప్ లో ఉన్న రాజేష్ ను చూపించిది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇలా చెప్పుకుంటూ పోతే రాజేష్ ను ఏ ఫిర్యాదు లేకుండా చట్టవిరుద్ధంగా పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని చెప్పడానికి అనేక ఆధారాలు ఉన్నాయని అన్నారు.రాజేష్ ను తీవ్రమైన చిత్ర హింసలు పెట్టారని చెప్పడానికి అనేక ఆధారాలు ఉన్నాయని అన్నారు. రాజేష్ తీవ్రమైన చిత్రహింసలు ఎదుర్కొని కోర్టులో నడవలేని స్థితిలో ఉన్నప్పుడు పోలీసులు హైకార్డ్ అనే ఇంజక్షన్ తెప్పించి సహ నిందితుడైన శేఖర్ ద్వారా రాజేష్ నరానికి ఇంజక్షన్ వేయించింది నిజం కాదా అన్నారు. పోలీసులు డాక్టర్ల సూచన లేకుండా రాజేష్ కు చట్ట విరుద్ధంగా ఇంజక్షన్ వేయించి కోర్టులో హాజరుపరిచారని అన్నారు. అందుకు సంబంధించిన సిరంజ్ , ఇంజక్షన్ బాటిల్ మిగితా ఆధారాలను ఇప్పటికే సేకరించినట్లు తెలిపారు .కర్ల రాజేష్ మృతి సంఘటనలో కోదాడ రూరల్ , చిలుకూరు పోలీసు స్టేషన్లు , కోర్టు ప్రాంగణం, అలాగే వివిధ ప్రాంతాల సిసి ఫుటేజ్ లను పరిశీలించాలని , ఫిర్యాదారుడు , నిందితులు , పోలీసుల కాల్ డేటా, లొకేషన్ వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపితే పూర్తి వివరాలు బయటకు వస్తాయని అన్నారు.పోలీసులు కాకమ్మ కథలు చెప్పి తప్పించుకోలేరని అన్నారు. ఇప్పటికే తన కుమారుని చావుకు చిలుకూరు ఎస్సై కోదాడ రూరల్ సిఐ కారణమని కర్ల లలితమ్మ రెండుసార్లు డిఎస్పి కి, ఒకసారి సూర్యాపేట ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. కర్ల రాజేష్ మీద కోదూరు రాజేష్ ఫిర్యాదు చేస్తే ఒక్క నిమిషం గడవకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కర్ల లలితమ్మ పోలీసుల మీద ఫిర్యాదు చేస్తే నెల రోజులు గడిచిన ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం అత్యంత దారుణమని అన్నారు. రాజేష్ సంఘటనలో ఎస్సై కేవలం రెడ్డి సామాజిక వర్గం కావడం వల్లనే చర్యలు తీసుకోవడం లేదని అదే స్థానంలో ఎస్సీ, ఎస్టీ బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎస్సై ఉండి ఉంటే ఇప్పటికే సస్పెండ్ చేసి అరెస్టు చేసేవారని అన్నారు. రాజేష్ స్థానంలో కస్టడీ డెత్ కు గురైన వారు రెడ్డి లేదా వెలమ కులాలకు చెందినవారు అయితే కారకులైన వారికి ఇప్పటికే శిక్షలు పడి ఉండేవి అని అన్నారు. ఈ వివక్షతను ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని కోరారు.తక్షణమే కర్ల రాజేష్ మృతికి కారకులైన చిలుకూరు ఎస్సై సురేష్‌రెడ్డి కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగం పై మర్డర్ కేసు అలాగే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని , వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిపుణులైన ఫోరెన్సిక్ డాక్టర్ల చేత రాజేశ్ మృతదేహానికి రీ పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రధాన ఆధారాలుగా ఉన్న సిసి కెమెరాలు ఫుటేజ్ లు అలాగే కాల్ డేటా లొకేషన్ వివరాలు వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసును శాస్త్రీయంగా పరిశీలిస్తే సాక్షిగా ఉండాల్సిన రాజేష్ నిందితుడిగా మారి చివరకి హతుడిగా మిగిలాడని అని అన్నారు . ఇది పోలీసులు చేసిన చారిత్రక తప్పిదమని అన్నారు. రాజేష్ సీఎంఆర్ ఫ్ డబ్బుల నేరంలో భాగస్వామి కాదు అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కస్టడీలలో హింసకు గురై లాకప్ డెత్ లలో మరణిస్తుంది అత్యధికంగా దళితులే అని అన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ ని కోరారు. రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. అన్ని వివరాలు డిజిపి కి తెలిపామని , వారు న్యాయం చేస్తారనే. నమ్మకం ఉందని అన్నారు.మందకృష్ణ మాదిగ విజ్ఞప్తిపై డీజీపీ స్పందిస్తూ ఈ సంఘటనపై త్వరలోనే విచారణ చేపడతామని న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాది, కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏపూరి రాజు మాదిగ, హైకోర్టు అడ్వకేట్ దున్న అంబేద్కర్ , కర్ల రాజేశ్ తమ్ముడు కర్ల కమల్ తదితరులు పాల్గొన్నారు.



# మేరీ ఆనంద్ గెలుపుతో ధర్మారానికి అభివృద్ధి వెలుగు

* పెన్షన్లు–ఇళ్లు–సంక్షేమ పథకాలు మరింత విస్తరిస్తాయి
* తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్

అడ్డగూడూరు (ధర్మారం), ప్రజాస్ఫూర్తి : ధర్మారం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మేరీ ఆనంద్ గెలుపు ఖాయమని, గ్రామ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న వార్డు సభ్యులందరినీ గెలిపించాలని ఆయన కోరారు.సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో పెన్షన్ల సమస్యలు, ప్రభుత్వ ఇళ్ల మంజూరు, త్రాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్, వార్డు సభ్యులు గెలిస్తే గ్రామాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని, ఇల్లు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేయడంలో ఎలాంటి వివక్ష ఉండదని హామీ ఇచ్చారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత కోసం ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, త్రాగునీటి కొరత, ఉపాధి అవకాశాల లేమి, పాఠశాలలు -ఆరోగ్య కేంద్రాల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందన్నారు. గ్రామస్థులు తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు.సర్పంచ్ ఎన్నికలు గ్రామ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే మందుల సామెల్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# క్రిస్మస్ పండగ కుల మతాలకు, ప్రాంతాలకు అతీతంగా జరుగుతుంది

* నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ



మల్కాజ్గిరి,( ప్రజాస్ఫూర్తి ): క్రిస్మస్ పండగ కుల మతాలకు, ప్రాంతాలకు అతీతంగా జరుగుతుందని నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్ సఖి మహిళా మండలి ఆధ్వర్యంలో నేరేడ్మెట్ లోని అంబేద్కర్ భవన్ లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సఖి మహిళా మండలి సోదరీమణులకు చీరలు, గిఫ్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండగ సామరస్యానికి ప్రతీక. సోదర భావంతో క్రిస్మస్ పండుగను భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలు నిర్వహిస్తూ ఉంటాయన్నారు. సఖి మహిళలందరినీ ఒకేవేళ మీదకు పిలిచి క్రిస్మస్ సంబరాలను కేక్ కట్ చేసి ముందుగానే పండగ చేసుకోవడం చిరస్మరణీయ ఘట్టంగా చెప్పవచ్చునన్నారు. సఖి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో నేషనల్ ప్రెసిడెంట్ కంచర్ల మంజూష క్రిస్మస్ వేడుకలకు వచ్చిన ప్రతి సోదరీమణుని ఘనంగా సన్మానించి వారికి ఆత్మీయ ఆతిథ్యం ఇవ్వడం నిజంగా గర్వించదగ్గ విషయం అని నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్వేత, శ్రీలత, శారద, లావణ్య, వరలక్ష్మి, అన్నపూర్ణ యాదవ్, నిట్టా పద్మావతి, లక్ష్మి, పోచబోయిన రేఖ తదితర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామాలకు పూర్తిస్థాయి నిధులు అందాలనే పంచాయతీ ఎన్నికలు: మంత్రి సీతక్క

హైదరాబాద్: తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటివరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహచర మంత్రుల నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రామస్థాయిలో సత్తా చాటిందన్నారు. ''బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంది. గ్రామాలకు పూర్తి స్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించాం. సమ్మక్క సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదు. రాళ్లు



కాదు.. రాతి శిలలపై చెక్కిన చరిత్రే ఆదివాసీ అస్తిత్వానికి నిదర్శనం. ఇళ్ల విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నరలో కొన్ని వేల ఇళ్లు ఇచ్చింది. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారింది. తాడ్వాయి ప్రాంతంలో ఆదివాసీ మహిళ గెలిస్తే భూములు లాగేసుకుంటారని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం నీచమైన రాజకీయం. మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదు'' అని మంత్రి సీతక్క హెచ్చరించారు.




## మూడో విడతకు సర్వం సిద్ధం..
# 3,752 పంచాయతీల్లో పోలింగ్

హైదరాబాద్: తెలంగాణలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. మూడో విడతలో మొత్తం 4,159 సర్పంచి స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 394 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 3,752 సర్పంచి స్థానాలకు 12,652 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 36,425 వార్డులకుగాను 7,908 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 28,410 వార్డులకు 75,725 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 11 సర్పంచి స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. రెండు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిపివేశారు.

# సింగరేణి ఇన్‌ఛార్జి సీఎండీగా ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్

హైదరాబాద్: సింగరేణి సంస్థకు ఇన్‌ఛార్జి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ట్రాన్స్‌కో సీఎండీగా, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతుండగా.. సింగరేణి బాధ్యతలను అదనంగా అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకూ ఈ పోస్టులో కొనసాగుతారని ప్రభుత్వం తెలిపింది. ఇంతకాలం ఇన్‌ఛార్జి సీఎండీగా ఉన్న బలరాంను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి కేంద్ర ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్)లో పని చేస్తున్న బలరాం.. డిప్యుటేషన్‌పై సింగరేణికి వచ్చారు. కేంద్రం అనుమతించిన డిప్యుటేషన్ పదవీకాలం గడువు ఈ నెల 4తో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో కృష్ణభాస్కర్ బాధ్యతలు స్వీకరించారు.

**తాత్కాలికమా.. కొనసాగిస్తారా?**



సింగరేణి సీఎండీ పోస్టు కోసం పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. తెలంగాణ స్థానికత కలిగిన ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారిని రెగ్యులర్ సీఎండీగా నియమించవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈలోగా కృష్ణభాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులో ప్రభుత్వం తెలిపింది. ఆయననే కొనసాగిస్తుందా, లేక మరో సీనియర్ అధికారిని రెగ్యులర్ సీఎండీగా నియమిస్తుందా అనేది తేలాల్సి ఉంది. కృష్ణభాస్కర్ గతంలో రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేశారు. ప్రజాపరిపాలనలో ప్రధానమంత్రి పురస్కారం పొందారు.

# ఐబొమ్మ రవికి మరోసారి పోలీసు కస్టడీ

హైదరాబాద్: ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని మరోసారి పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరో 3 కేసుల్లో 4 రోజుల చొప్పున 12 రోజులపాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈ నెల 18 నుంచి సైబర్‌క్రైమ్ పోలీసులు అతణ్ని విచారించనున్నారు.



## పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టుపై
# సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ

హైదరాబాద్: పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బచావత్ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించే ప్రయత్నం చేస్తున్నారంటూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయంలో ముందుకు



వెళ్లకుండా అడ్డుకోవాలని కోరింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి దాదాపు 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమలసాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ లింక్ ప్రాజెక్టు చేపడుతోంది.



# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను మరుసటి రోజు (మార్చి 4న) నిర్వహించనున్నట్లు తెలిపింది. మార్చి 3న హోలీ పండగ ఉండటంతో పరీక్షల తేదీలో మార్పు చేసినట్లు వెల్లడించింది. మిగతా పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు పేర్కొంది.

# కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16 మంది మావోయిస్టుల అరెస్ట్

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మావోయిస్టులు ఆశ్రయం పొందాలని చూడటం అలజడి రేకెత్తించింది. కుమురం భీం జిల్లా సిర్పూర్(యు) మండలం బాజ్జీపేట పంచాయతీ పరిధిలోని పెద్దదోబ గూడెంలో ఓ ఇంట్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసు యంత్రాంగం పసిగట్టింది. కుమురం భీం ఏఎస్పీ చిత్తరంజన్ నేతృత్వంలో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుంది. ఎదురుకాల్పులకు తావులేకుండానే 16 మందిని అదుపులోకి తీసుకుంది. వారి నుంచి ఒక ఏకే47, మరో రెండు ఇన్సాస్ ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. పోలీసులు అరెస్టు చేసిన మావోల్లో తొమ్మిది మంది మహిళలు, మరో ఏడుగురు పురుషులు ఉన్నారు. వీరంతా



ఛత్తీస్‌గఢ్ వాసులని తెలుస్తోంది. పట్టుబడిన మావోలతోపాటు షెల్టర్ ఇచ్చిన మరో ముగ్గురు పెద్దదోబ వాసులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లో పెద్దఎత్తున ఏరివేత నేపథ్యంలో.. షెల్టర్ కోసం కుమురం భీం జిల్లాకు వచ్చిన మావోలు సెల్‌ఫోన్ వినియోగించటంతో నిఘావర్గాల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది.



# పదేళ్లు కాంగ్రెస్ సర్కారుకు ఢోకా లేదు..

- **అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతో ప్రభుత్వాని మరింత బలం**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**

అందోలు, ప్రజాస్ఫూర్తి: గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతూ అత్యధిక స్థానాల్లో గెలుపిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహా అన్నారు. సోమవారం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామ పంచాయితీ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ మదత్తు సర్పంచ్, వార్డు సభ్యులు మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారుల గెలుపు ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. అందోల్ నియోజకవర్గంలో మొదటి, రెండవ విడుతలలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయితీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టేలా గ్రామాల అభివృద్ధికి పాలకవర్గ సభ్యులందరూ కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, నూతన సర్పంచ్ తెనుగు సునితమహిపాల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, మాజీ ఎంపిటీసీ బాలయ్య, నాయకులు క్రిష్ణ, రమేశ్‌గౌడ్, వీరేశం, జాను, బాల్‌రాజ్, నూతన ఉప సర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు దేవునూరి లక్ష్మీమాణయ్య, కలపల్లి లక్ష్మి ప్రభు, వని రమాదేవి దుర్గేష్‌వని మోహన్, తలారి బాలక్రిష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని వద్దని చెప్పినా ఆ అంశాలు లీక్ చేశారు.. కిషన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్: ప్రధాని మోదీతో తెలంగాణ భాజపా ఎంపీలతో జరిగిన సమావేశంలోని అంశాలు లీక్ కావడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్‌లో జరిగిన విషయాలు బయటకు చెప్పొద్దని ప్రధాని అన్నారని, అయినా ఆ విషయాలు బయటకు వచ్చాయని అసహనం వ్యక్తంచేశారు. ఆ అంశాలు బయటకు చెప్పినవారు ఎవరో చెబితే చర్యలు తీసుకుంటామన్నారు. ''సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని చెప్పారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. దక్షిణ భారత్ నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉప రాష్ట్రపతులు అయ్యారు. భాజపాలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుంది'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

*** రైల్వే మంత్రితో కిషన్‌రెడ్డి భేటీ.. రాష్ట్రంలోని ప్రాజెక్టులపై చర్చ**

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు.



రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై చర్చించామన్నారు. రూ.400 కోట్లతో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు పొడిగించాల్సిన ఎంఎంటీఎస్ రెండో దశపై మాట్లాడినట్లు తెలిపారు. కొమరవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తిచేసి దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన్ను కోరినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ఓట్ చోరీ ర్యాలీలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి ఖండించారు. రాహుల్ అనైతికంగా మాట్లాడుతున్నారన్నారు. ఏ విషయాలు మాట్లాడాలనే దానిపై ఆయనకు అవగాహన లేదని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ ఉండటం దురదృష్టకరమన్నారు.

# మెట్ టీమ్‌ల పనితీరు భేష్ : హైడ్రా కమిషనర్ రంగనాథ్

తెలంగాణ బ్యూరో : 'ప్రతి సంవత్సరం చేసే పనే.. కానీ ఈ వర్షాకాలంలో చేసిన పని ఎంతో సంతృప్తినిచ్చింది. భారీవర్షాలు కురిసాయి.. ఒక్క రోజులోనే 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం పడడం సర్వ సాధారణంగా మారింది. కాని ఎక్కడా వరదలు లేవు. కాలనీలు, బస్తీలు నీట మునగలేదు. ఒక వేళ వరద వచ్చినా.. వెంటనే క్లియర్ అయ్యింది. ఒక పద్ధతి ప్రకారం పని చేసుకుంటూ పోతే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ ఏడాది చూశాం.. అధికారుల పర్యవేక్షణ, సహకారం, సమస్య తలెత్తితే పరిష్కరించిన తీరు.. మా పని మరింత సులభం చేసింది. దీంతో క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించాయి' అని వర్షాకాలంలో హైడ్రాతో కలసి పని చేసిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లతో పాటు స్టాటిక్



టీమ్‌ల కాంట్రాక్టర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ మెట్ కాంట్రాక్టర్లను అభినందించారు. కల్వర్టులు, క్యాచ్‌పిట్లలో పూడికను తీయడమే ఒప్పందం అయినా.. హైడ్రాతో కలసి నాలాలను కూడా క్లియర్ చేశారని.. దీంతో వరద సాఫీగా సాగిందన్నారు.

**అడుగడుగునా సహకారం..**

మెట్, స్టాటిక్ టీమ్‌ల కాంట్రాక్టర్ల ఎంపిక నుంచి 150 రోజుల పాటు పని చేసినన్ని రోజులు హైడ్రా తమకు ఎంతో సహకారం అందించిందని కాంట్రాక్టర్లు అన్నారు. 30 సర్కిళ్లకు వేర్వేరు కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల ఎందరికో ఉపాధి దొరికింది. ఒక్కో టీమ్‌లో ఐదుగురు చొప్పున ఒక్కో డివిజన్‌లో 3 బృందాలు పని చేశాయి. ఇలా 150 టీమ్‌లు.. 2250 మంది పని చేశారు. వీరికి తోడు 1200ల మంది స్టాటిక్ (వరద నిలిచే ప్రాంతంలో పని చేసే సిబ్బంది) టీమ్ సభ్యులు తోడయ్యారు. మొదటి వర్షంతోనే సమస్య ఎక్కడ ఉత్పన్నం అవుతోంది.. అనేది హైడ్రా అంచనా వేసింది.

# 'డిజిటల్ అరెస్టు'తో రూ.57లక్షలు కాజేసీ.. క్రిప్టోగా మార్చి!

చెన్నై: పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త డి. రామస్వామి ఇటీవల సైబర్ మోసానికి గురయ్యారు. 'డిజిటల్ అరెస్టు' తో ఆయన నుంచి రూ.57లక్షలను దోచేసిన సైబర్ మోసగాళ్లు.. ఆ డబ్బును క్రిప్టో కరెన్సీలోకి మార్చినట్లు చెన్నై సైబర్ క్రైం పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. లెదర్ టెక్నాలజీలో నిపుణులైన డి. రామస్వామి (77) గతంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ కార్యదర్శిగానూ పనిచేశారు. ఆయన సేవలకు 2001లో పద్మశ్రీ, 2014లో పద్మ విభూషణ్ పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ప్రస్తుతం చెన్నైలో నివసిస్తున్న ఆయన.. ఓ యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సెప్టెంబర్‌లో రామస్వామిని లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు.. డిజిటల్ అరెస్టుతో ఆయన నుంచి రూ. 57లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన ఆయన చివరకు పోలీసులను ఆశ్రయించారు. విచారణ జరిపిన చెన్నై సైబర్ పోలీసులు ఆ నగదును సైబర్ మోసగాళ్లు విదేశాలకు తరలించి, క్రిప్టో కరెన్సీలోకి మార్చినట్లు నిర్ధరణకు వచ్చారు. రామస్వామి నుంచి తొలుత వివిధ ఖాతాల్లోకి డబ్బును బదిలీ చేయించుకున్న మోసగాళ్లు.. చెక్‌ల రూపంలో వాటిని



విత్‌డ్రా చేయించి, అదేరోజు విదేశాలకు బదిలీ చేయించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకోసం ఏజెంట్లను నియమించుకున్నట్లు అనుమానిస్తున్నారు. బాధితుడికి వచ్చిన వాట్సప్ కాల్స్‌ను విశ్లేషించిన సైబర్‌క్రైం నిపుణులు.. అవి కాంబోడియా నుంచి వచ్చినట్లు కనుగొన్నారు. ప్రస్తుతం ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత ఫిర్యాదులను 1930 లేదా సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు.



## బీజాపూర్‌లో 34 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్, సీఆర్పీఎఫ్ డీఐజీ ఎదుట మంగళవారం 34 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిపై మొత్తం రూ.84 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టులు ఇక హింస మార్గాన్ని విడనాడక తప్పదన్నారు.

## చనిపోయిన వారి జాబితాలో పేరుందని..
### శ్మశానవాటికలో కౌన్సిలర్ నిరసన

పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అధికార తృణమూల్ కాంగ్రెస్ నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఓటరు ముసాయిదాలో చనిపోయిన వారి జాబితాలో తన పేరు ఉందంటూ ఓ కౌన్సిలర్ ఆరోపించారు. స్థానిక శ్మశానవాటికకు వెళ్లి తన అంత్యక్రియలు చేపట్టాలని డిమాండ్ చేయడం గమనార్హం. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓటర్ల జాబితాను బూత్‌ల వారీగా ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసింది. వీరిలో డాంకునీ మున్సిపాలిటీలోని 18వ వార్డు కౌన్సిలర్ సూర్య దేవ్.. తన పేరు చనిపోయిన వారి జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌లో తన వివరాలను బీఎల్ఓకు అందజేసినప్పటికీ తన పేరు తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను చనిపోయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించిందని ఆరోపించిన దేవ్.. మద్దతుదారులతో కలిసి స్థానిక కాళీపూర్ శ్మశానవాటికలోకి వెళ్లారు. అధికారులు వచ్చి తనకు అంత్యక్రియలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది తప్పిదం కాదని, ప్రమాదకర పరిణామమన్నారు. స్థానిక ప్రజాప్రతినిధికే ఇటువంటి దుస్థితి





ఎదురైతే, సాధారణ ఓటర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను ఇంకా జీవించే ఉన్నానని, దీనిపై ఈసీ సమాధానం చెప్పాలన్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్‌లో పశ్చిమబెంగాల్ ఓటరు జాబితా నుంచి 58.20లక్షల పేర్లను ఈసీ తొలగించింది. వీరిలో దాదాపు 24 లక్షల మంది మరణించారని, మరో 19 లక్షల మంది ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని, మరో 12లక్షల మంది వివరాలు తెలియలేదని పేర్కొంది. మొత్తంగా ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో 7.66 కోట్ల ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 7.08 కోట్లకు తగ్గింది.

## మహాత్మా గాంధీ ఆదర్శాలకు అవమానం
### : ఎంజీ నరేగా రద్దుపై రాహుల్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లు ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను అవమానించమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోందని దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు.



ఈ ప్రజా వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ర్యాలీగా పార్లమెంటు వరకు వెళ్లి తమ నిరసనను తెలియజేస్తాయన్నారు. "మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులపై ప్రధాని మోదీకి ముందు నుంచి తీవ్రమైన అయిష్టత ఉంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే గాంధీ ఆలోచనకు ఎంజీ నరేగా ఓ సజీవ స్వరూపం. ఎన్నో ఏళ్లుగా ఇది లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు జీవనాడిగా ఉంది. కొవిడ్ సమయంలో కూడా ఈ పథకం పేదలకు ఆర్థిక భద్రతను ఇచ్చింది. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఎంజీ నరేగా ప్రధాని మోదీ ని ఎప్పుడూ కలవరపెడుతూనే ఉంది. కాబట్టి దీనిని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దీనిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు" అని రాహుల్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

## సూర్యఘర్ స్కీమ్.. 7.71లక్షల కుటుంబాలకు జీరో బిల్లు

దిల్లీ: గతేడాది ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్: ముఫ్త్ బిజిలీ యోజన పథకం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 24.35 లక్షల కుటుంబాలు లబ్ధి పొందగా.. వారిలో 7.7 లక్షల కుటుంబాలకు జీరో బిల్లు వచ్చినట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ రాజ్యసభకు మంగళవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం 2024 ఫిబ్రవరిలో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 2026 27 నాటికి మొత్తం కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడం దీని లక్ష్యం. 2025 డిసెంబర్ 9 వరకు 19.45 లక్షల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు అయ్యాయని, దీనిద్వారా 24,35,196 కుటుంబాలు లబ్ధి పొందాయని మంత్రి వెల్లడించారు. ఇప్పటి వరకు 7,71,580 కుటుంబాలకు జీరో బిల్లు వచ్చిందని తెలిపారు. కేంద్ర సాయం కింద రూ.13,926.25 కోట్లు సాయం విడుదల చేసినట్లు వెల్లడించారు. 8,30,617 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు



పేర్కొన్నారు. ఈ స్కీమ్‌లో చేరడానికి గృహ వినియోగదారులంతా అర్హులే. ఒకసారి ప్యానళ్లను పెట్టుకుంటే 25 సంవత్సరాల వరకు గ్యారెంటీ ఉంటుంది. ఒక కిలోవాట్ ప్లాంటు పెడితే రూ.30 వేల సబ్సిడీ దక్కనుంది. రెండు కిలోవాట్లు అయితే రూ.60 వేలు, మూడు లేదా అంతకంటే ఎక్కువైతే రూ.78 వేలు ఇస్తారు. ఉదాహరణకు మూడు కిలోవాట్ల యూనిట్‌ను పెట్టుకుంటే రూ.2.30 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందులో రూ.78 వేలు రాయితీ కింద దక్కుతుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా పొందొచ్చు. 10 సంవత్సరాల వరకు వాయిదాల రూపంలో కట్టుకోవచ్చు. ఒకవేళ మిగులు యూనిట్లు ఉంటే వాటిని విద్యుత్ శాఖకే అమ్మి, ఆ సొమ్ముతో చెల్లింపులు పూర్తిచేసుకోవచ్చు. ఈ పథకం మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం పీఎం సూర్యఘర్ పోర్టల్‌ను సందర్శించండి.



## కోల్‌కతా మెస్సి ఈవెంట్ ఘటన..
### రాజీనామా చేసిన క్రీడాశాఖ మంత్రి

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి పర్యటన వేళ కోల్‌కతా స్టేడియంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బెంగాల్ ప్రభుత్వం దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర క్రీడల మంత్రి అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేశారు. స్టేడియంలో గందరగోళం విషయంలో ఆయనపై తీవ్ర విమర్శలు వస్తుండడంతో.. ఈ ఘటనపై న్యాయబద్ధంగా దర్యాప్తు జరిగేందుకు వీలుగా తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తన రాజీనామా లేఖను పంపినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న విచారణ కమిటీ సూచనల మేరకు బెంగాల్ ప్రభుత్వం డీజీపీ రాజీవ్ కుమార్, బిధాన్‌నగర్ పోలీస్ కమిషనర్ ముఖేష్ కుమార్, యువజన వ్యవహారాలు క్రీడాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేష్ కుమార్ సిన్హాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఘటనలో లోపాలపై 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. బిధాన్‌నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అనీష్ సర్కార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత పర్యటనలో భాగంగా శనివారం కోల్‌కతా స్టేడియానికి వచ్చిన మెస్సి కొన్ని నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ప్రేక్షకులు ఆగ్రహానికి గురయ్యారు. సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలను మైదానంలోకి విసిరారు. స్పాన్సర్ బ్యానర్లు, హోర్డింగ్‌లను చించివేశారు. కొంత మంది ప్రేక్షకులు బారికేడ్లను దాటి మైదానంలోకి దూసుకెళ్లారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి అరూప్ బిశ్వాస్, ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఈ ఘటనపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.

## పేర్లు మార్చడం అంటే మోదీకి ఎందుకంత ఇష్టమో?
### : 'వీబీ జీ రామ్ జీ'పై ప్రియాంక గాంధీ

దిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని (ఎంజీ నరేగా) రద్దు చేస్తూ దాని స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ) బిల్లు 2025'ను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ఎంజీ నరేగా చట్టాన్ని బలహీనపర్చడమేనని దుయ్యబట్టారు. "ప్రభుత్వ పథకాల పేర్లను మార్చడం అనేది చాలా



ఖర్చుతో కూడుకున్న పని. అయినా కేంద్రం మారుస్తూనే ఉంది. పథకాల పేర్లను మార్చడం అంటే మోదీ ప్రభుత్వానికి ఎందుకంత ఇష్టమో అర్థం కావట్లేదు. ఎంజీ నరేగా చట్టం పేద ప్రజలకు 100 రోజుల ఉపాధి హామీ కల్పిస్తోంది. ఈ కొత్త బిల్లుతో ప్రస్తుత చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బిల్లులో ఒకటో, రెండో కొత్త విషయాలు చేర్చారు. పని దినాలను పెంచారు. అంతేగానీ.. వేతనాన్ని పెంచారా?" అని ప్రియాంక ప్రశ్నించారు. "గతంలో గ్రామ పంచాయతీలు ఈ పథకం కింద పని చేయించేవి. ఇప్పుడు కొత్త బిల్లుతో పంచాయతీలకు ఆ హక్కును దూరం చేస్తున్నారు. ఇక, ఈ బిల్లుతో ఉపాధి హామీ పథకంపై కేంద్రం నియంత్రణను పెంచి, నిధులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి ఇష్టానుసారంగానో బిల్లులను ఆమోదించుకుంటామంటే కుదరదు. ఈ బిల్లును తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలి" అని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. ప్రియాంక మాట్లాడుతుండగా.. ట్రెజరీ బెంచ్‌లో కొందరు 'ఫ్యామిలీ' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ.. "మహాత్మా గాంధీ మా కుటుంబానికి చెందిన వ్యక్తి కాదు కానీ, మా కుటుంబసభ్యుడితో సమానం. గాంధీజీని యావత్ దేశం అలాగే భావిస్తోంది" అని కౌంటర్ ఇచ్చారు. అనంతరం టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ రాముడి పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఉద్దేశపూర్వకంగా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, విపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తిప్పికొట్టారు. మహాత్మాగాంధీ అంటే తమకు ఎంతో గౌరవమని, ఆయన సిద్ధాంతాలను తమ ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాల కంటే మోదీ సర్కారు ఎంతో కృషి చేసిందని తెలిపారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ బిల్లుపై లోక్‌సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. కేంద్రం తీరును నిరసిస్తూ విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి.

## గాంధీ పేరు తొలగించడం అనైతికం: శశిథరూర్

దిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. ఇందులో భాగంగానే 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ) బిల్లు 2025ను మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ఈ పథకానికి గాంధీ పేరును తొలగించడం అనైతికమని అన్నారు. అంతేగాక, రాముడి పేరును అపవిత్రం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కూడా థరూర్ ఈ పేరు మార్పుపై ఎక్స్ వేదికగా స్పందించారు. "ఎంజీనరేగా పేరు మార్చి.. కేంద్రం కొత్తగా జీ రామ్ జీ బిల్లు తీసుకురావడంపై జరుగుతున్న వివాదం దురదృష్టకరం. గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు, రామరాజ్య ఆదర్శాలు ఎన్నటికీ ఒకదానితో ఒకటి పోటీపడేవి కాదు.

# ఆమె గట్టిగా స్పందించడంతో వెనక్కి తగ్గారు: సీఎం చంద్రబాబు



వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు న్యాయస్థానాల పట్ల ఏమాత్రం గౌరవం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. అక్రమాస్తుల కేసుల్లో కోర్టుకు హాజరుకాకపోవడమే దీనికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. మంగళవారం నాడు అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన చంద్రబాబు, పలు రాజకీయ, పార్టీ అంశాలపై స్పందించారు. తిరుమల పరకామణి చోరీ కేసును సాధారణ దొంగతనంగా చూడటాన్ని హైకోర్టు తప్పుపట్టిందని గుర్తుచేశారు. ఇది భక్తుల మనోభావాలతో ముడిపడిన తీవ్రమైన విషయమన్నారు. అలాగే, పీపీపీ విధానంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను వైసీపీ ఎంపీలు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, అయితే ఆమె గట్టిగా స్పందించడంతో వారు వెనక్కి తగ్గారని తెలిపారు. పీపీపీ విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైందని, దీనివల్ల పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఇదే సమయంలో పార్టీ సంస్థాగత అంశాలపైనా చంద్రబాబు దృష్టి సారించారు. టీడీపీ జిల్లా కమిటీల అధ్యక్ష పదవుల నియామకంపై త్రిసభ్య కమిటీలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలయ్యే అవకాశం ఉన్నందున, పార్టీలో మహిళల ప్రాతినిధ్యాన్ని ప్రస్తుతమున్న 28.4 శాతం నుంచి 30 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో జిల్లా అధ్యక్షుల జాబితాను ప్రకటిస్తామని, నెలాఖరులోగా రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి కమిటీల పనితీరును సమీక్షిస్తానని, పనిచేయని వారిని నిర్మొహమాటంగా తొలగిస్తానని హెచ్చరించారు. జనవరి నుంచి నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో పార్టీ క్యాలెండర్ ప్రకారం పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.




## పరకామణిలో నేరం.. దొంగతనం కంటే పెద్దది: ఏపీ హైకోర్టు

అమరావతి: తిరుమల పరకామణి చోరీ కేసుపై ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరకామణిలో జరిగిన నేరం.. దొంగతనం కంటే పెద్దదని పేర్కొంది. "భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి బాధ్యత ఉండదు. తితిదేలో ఔట్ సోర్సింగ్ నియామకాలు సరికాదు. విరాళాల లెక్కింపు వద్ద టేబుళ్లు ఏర్పాటు చేయాలి. లెక్కింపు కోసం భక్తులను ఎందుకు తీసుకోకూడదు? తితిదే నిర్వహణలో ఏఐని ఉపయోగించాలి" అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

## మేలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం: రామ్మోహన్‌నాయుడు







విశాఖపట్నం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందంగా సిద్ధం చేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో రాడిసన్ బ్లూ రిసార్టులో రాష్ట్ర మంత్రి లోకేశ్ సమక్షంలో జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టును ప్రారంభించాలనుకున్నామని.. కానీ ఒక నెల ముందుగానే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎడ్యుసిటీ ఉంటే ఎన్నో విద్యాలయాలు, యూనివర్సిటీలు పెట్టుకోవచ్చన్నారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపకరిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా ప్రభుత్వం నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరంవిశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటుచేయనుంది. గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, జీఎంఆర్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ఈ ప్రాజెక్టులో కీలకం కానున్నారు. దీనికి జీఎంఆర్ మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్ట్‌గా నామకరణం చేశారు.

## ఆస్పత్రికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం.. తల్లీకుమారుడి మృతి




గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లాలో చోటుచేసుకుంది. కుమారుడు అనారోగ్యానికి గురవడంతో మెరుగైన వైద్యం కోసం తల్లి, బంధువులు విశాఖపట్నం తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్రేయపురం మండలం వెలుచూరు గ్రామానికి చెందిన తోర్లపాటి తులసి (40)కి సంజయ్, శశికుమార్ (24) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. శశికుమార్‌కు క్యాన్సర్ వ్యాధి ఉంది. విశాఖపట్నంలోని ఆస్పత్రికి వెళ్లేందుకు తల్లితో పాటు ఇద్దరు కుమారులు, బంధువులు తోర్లపాటి పాపారావు, నాగబత్తుల శ్రీను కారులో బయల్దేరారు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గండేపల్లి శివారుకు వచ్చేసరికి ముందు వెళ్తున్న ట్రాలీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తులసి అక్కడికక్కడే మృతిచెందగా.. శశికుమార్‌ను రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మరణించాడు. మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వారికి రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు.

## జగన్‌కు అప్పట్లో రుషికొండపై ఉన్న శ్రద్ధ.. మెడికల్ కాలేజీలపై లేదు

**: మంత్రి అనగాని**




రేపల్లె: ఆర్థికంగా వెనకబడిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని తెదేపా కార్యాలయంలో 41 మందికి రూ.86 లక్షల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.10 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఏ పేదవాడికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందలేదన్నారు. కోటి సంతకాలంటూ వైకాపా నేతలు నాటకాలు మొదలుపెట్టారని మంత్రి విమర్శించారు. రెండేళ్లలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఒక్క మెడికల్ కాలేజీ కూడా పూర్తి చేయలేదన్నారు. జగన్‌కు అప్పట్లో రుషికొండపై ఉన్న శ్రద్ధ.. మెడికల్ కాలేజీలపై లేదని విమర్శించారు. 201924లో రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్లారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో విశాఖ ఐటీ హబ్‌గా మారుతుందన్నారు.




## సంక్రాంతి వేళ గుడ్‌న్యూస్.. వాట్సాప్ ద్వారా RTC టికెట్ బుకింగ్

సంక్రాంతి పండుగ సమీపిస్తోన్న వేళ ఏపీ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకున్నది. వాట్సాప్ ద్వారా టికెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు వీలు కల్పించింది. మన మిత్ర (9552300009) వాట్సాప్ ద్వారా సేవలు అందించనుంది. తెలుగు, ఇంగ్లీష్‌లో వాట్సాప్ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లాల ఆర్టీసీ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పండుగ వేళ ఇది ప్రయాణికులకు భారీ ఉపశమనం కలిగిస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గతేడాది సంక్రాంతి సీజన్‌లో ఏపీఎస్ ఆర్టీసీకి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. జనవరి 8 నుంచి 20 వరకు ఆర్టీసీ 9,097 ప్రత్యేక బస్సులు నడిపింది. మూడు రోజుల్లో రూ. 60 కోట్లకు పైగా ఆదాయం ఆర్జించింది. ఈసారి అంతకుమించి రాబట్టాలని చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

## కౌలు రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్



కౌలు రైతులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పంటలు సాగు చేసుకునేందుకు కౌలు రైతులకు కూడా రుణాలు ఇవ్వాలని సహకార బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. కౌలు రైతుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని, అర్హులైన వారికి రుణ సౌకర్యం కల్పించాలని తెలిపింది. అయితే కౌలు రైతులు PACS సభ్యత్వం, ఆ పరిధిలో నివాసం, కౌలుపత్రం కలిగి ఉండాలని నిబంధనలు విధించింది. అలాగే ఎకరాకు తక్కువ కాకుండా కౌలు చేసిన వారికే ఈ రుణ సౌకర్యం వర్తింస్తుందని తెలిపింది. అలాంటి కౌలు రైతులకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు రుణాలు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అంతేకాదు రైతులు వ్యక్తిగతంగా లేదా సంఘంగా ఏర్పడి రుణాలు పొందవచ్చని పేర్కొంది. ఇక ఆయా రుణాలను వడ్డీతో సహా ఏడాదిలోపు చెల్లించాల్సి ఉంటుంది. కాగా డీకేటీ, అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసే వారికి ఈ రుణాలు వర్తించవని ప్రభుత్వం తెలియజేసింది.

## 5,757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసిన సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో కొత్తగా నియమితులైన 5,757 మంది కానిస్టేబుళ్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళగిరిలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొత్తగా నియమితులైన కానిస్టేబుళ్లకు ఈనెల 22వ తేదీ నుంచి శిక్షణ (ట్రైనింగ్) ప్రారంభమవుతుందని తెలిపారు. ఉద్యోగ నియామక ప్రక్రియను అడ్డుకోవడానికి గతంలో కొందరు ఏకంగా 31 కేసులు దాఖలు చేశారని ఆయన గుర్తు చేశారు. కోర్టుల్లో న్యాయ పోరాటం చేసి, ఈ రిక్రూట్‌మెంట్‌ను విజయవంతంగా పూర్తి చేశామని, తాము అధికారంలోకి వచ్చినప్పుడల్లా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో ఇంత పెద్ద సంఖ్యలో నియామకాలు చేపట్టడం రాష్ట్రంలో శాంతిభద్రతలు బలోపేతానికి, యువతకు ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తుంది. అనేక న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొని ఈ నియామకాలు పూర్తి చేయడంపై ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేసింది. కొత్త కానిస్టేబుళ్లు తమ శిక్షణను పూర్తి చేసుకుని, త్వరలోనే రాష్ట్రంలో విధుల్లో చేరనున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు అందించడంలో తమ చిత్తశుద్ధిని చాటుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

# మస్క్ సరికొత్త రికార్డు..

**600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన తొలి వ్యక్తిగా ఘనత..!**



**న్యూఢిల్లీ:** అమెరికన్ టైకూన్, ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డును నెలకొల్పారు. వ్యక్తిగత సందప పరంగా మస్క్ ఏకంగా 600 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు. తద్వారా ప్రపంచంలోనే తొలిసారి ఈ రికార్డు నెలకొల్పిన వ్యక్తిగా మస్క్ చరిత్ర సృష్టించారు. మస్క్ స్థాపించిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరుకుని, ఐపీఓగా వచ్చే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో ఆయన సంపద ఈ స్థాయికి పెరగడం విశేషం.

వచ్చే ఏడాది స్పేస్‌ఎక్స్ పబ్లిక్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతోందని రాయిటర్స్ గత వారం నివేదించిన విషయం తెలిసిందే. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42% వాటా ఉంది. ఈ సంస్థ వాల్యూ పెరగడంతో మస్క్ సంపద కూడా వృద్ధి చెందింది. ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లు పెరిగి సోమవారం మధ్యాహ్నం సమయానికి మస్క్ నికర సంపద దాదాపు 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఇక ఈ ఏడాది అక్టోబరులో మస్క్ నికర సంపద 500 బిలియన్ డాలర్లు దాటిన సంగతి తెలిసిందే. 2022లో మస్క్ సంపద 200 బిలియన్ డాలర్ల కంటే దిగవుకు పడిపోయింది. ఆ తర్వాత మస్క్ సంపద పెరుగుతూ వస్తోంది. ఈ మూడేళ్లలోనే మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు దాటడం విశేషం. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ కుబేరుడు ఈ స్థాయిలో సంపదను ఆర్జించలేదు.

జీతం ట్రిలియన్ డాలర్లు..

మరోవైపు కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా మస్క్ రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో గత నెల జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది.

మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు...

**ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి**

**బలహీన అంతర్జాతీయ సంకేతాలతో నష్టాల్లో ముగిసిన సూచీలు**

**533 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 167 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**మెటల్, రియల్టీ, ఫైనాన్షియల్ షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలు**

**డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, దేశీయంగా మెటల్, రియల్టీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 533.50 పాయింట్లు నష్టపోయి 84,679.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167.20 పాయింట్లు క్షీణించి 25,860.10 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ షేర్లలో యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్ అత్యధికంగా 5 శాతం వరకు పతనమయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ వంటి హెవీవెయిట్ షేర్లు కూడా ఒక శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా లాభపడి మార్కెట్‌కు కొంత మద్దతునిచ్చాయి. ఎంఅండ్ఎం, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్ షేర్లు కూడా స్వల్ప లాభాలతో గ్రీన్‌లో ముగిశాయి.

విస్తృత మార్కెట్లోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.83 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.92 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ సూచీలు నష్టాల్లో ముగియగా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా రంగాల షేర్లు మాత్రమే లాభపడ్డాయి.

మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరింత క్షీణించి 91.01 వద్ద చారిత్రక కనిష‘ స్థాయికి చేరింది. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీ 25,870 కీలక సపోర్ట్ స్థాయిని కోల్పోవడం వల్ల బేరిష్ సెంటిమెంట్ పెరిగింది. స్వల్పకాలంలో నిఫ్టీ 25,700 స్థాయికి దిగివచ్చే అవకాశం ఉందని, ఎగువన 25,950-26,000 జోన్ కీలక నిరోధకంగా పనిచేయవచ్చని విశ్లేషిస్తున్నారు.

# త్వరలో ఏటీఎం, యూపీఐ ద్వారా పీఎఫ్ ఉపసంహరణ

**2026 మార్చిలోపు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడి**

**పీఎఫ్ ఖాతాలోని సొమ్ము ఉద్యోగులదేనన్న మన్‌సుఖ్ మాండవీయ**

**ఎటువంటి కారణం చూపకుండా 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది మార్చిలోగా ఏటీఎం, యూపీఐ ద్వారా పీఎఫ్ ఉపసంహరణ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. ఈపీఎఫ్ఓ చందాదారులు పీఎఫ్ నిధుల ఉపసంహరణ ప్రక్రియను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఏటీఎం, యూపీఐ ఉపసంహరణ సదుపాయం తీసుకొస్తామని గతంలోనే ప్రకటించింది. ఈ అంశంపై ఆయన మరోసారి స్పందించారు. పీఎఫ్ సొమ్ము ఉద్యోగులదేనని, ఈ మొత్తాన్ని ఉపసంహరించుకునే ప్రక్రియను సులభతరం చేయాలని చూస్తున్నామని అన్నారు. ఎటువంటి కారణం చూపకుండా 75 శాతం వరకు పీఎఫ్‌ను ఉపసంహరించుకోవచ్చని స్పష్టం చేశారు. ఏటీఎం ద్వారా పీఎఫ్ ఉపసంహరణకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. 2026 మార్చిలోపు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ఈపీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్మును ఉపసంహరించుకోవడానికి ఉద్యోగులు ఎన్నో పత్రాలు సమర్పించవలసి వస్తోందని అన్నారు. ఇప్పటికే ఆధార్, యూఏఎన్ అనుసంధానమయ్యాయని గుర్తు చేశారు. పీఎఫ్ ఖాతాను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయడం ద్వారా డెబిట్ కార్డుతో ఏటీఎంలో ఉపసంహరించుకునే సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

# ఐపీఎల్ వేలంలో కామెరాన్ గ్రీన్ సంచలనం..

**అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా రికార్డ్**

**ఐపీఎల్ వేలంలో కామెరాన్ గ్రీన్‌కు రికార్డు ధర**

**రూ. 25.20 కోట్లకు దక్కించుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్**

**ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా గ్రీన్**

**అమ్ముడుపోని ఆటగాళ్ల జాబితాలో డెవాన్ కాన్వే, పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్**




**అబుదాబీ:** ఐపీఎల్ 2026 మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ సంచలనం సృష్టించాడు. అతడిని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఏకంగా రూ. 25.20 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా గ్రీన్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో తన సహచర ఆటగాడు మిచెల్ స్టార్క్ (రూ. 24.75 కోట్లు, 2024) రికార్డును గ్రీన్ అధిగమించాడు.

గ్రీన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చివరికి షారుఖ్ ఖాన్ యాజమాన్యంలోని కేకేఆర్ భారీ ధరకు అతడిని సొంతం చేసుకుంది. ఒకవైపు విదేశీ ఆల్‌రౌండర్‌పై ఫ్రాంచైజీలు కాసుల వర్షం కురిపిస్తే, మరోవైపు ప్రతిభావంతులైన యువ భారత ఆటగాళ్లకు నిరాశే ఎదురైంది.

యువ ఓపెనర్ పృథ్వీ షాను కొనుగోలు చేసేందుకు ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపలేదు. రూ. 75 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతడు అమ్ముడుపోలేదు. దేశవాళీ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ వరుసగా రెండో వేలంలోనూ పృథ్వీ షాకు చుక్కెదురైంది.

అలాగే విధ్వంసకర బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ కూడా అమ్ముడుపోలేదు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా ఇవాళ జరిగిన మ్యాచ్‌లో కేవలం 22 బంతుల్లో 73 పరుగులు చేసినా, అతడిని ఎవరూ తీసుకోకపోవడం గమనార్హం. న్యూజిలాండ్ వికెట్ కీపర్ డెవాన్ కాన్వే కూడా అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు.

# కుర్రాళ్లకు జాక్‌పాట్..

**రూ.14.20 కోట్లు పలికిన చిచ్చరపిడుగులు..!**



**అబుదాబీ:** ఐపీఎల్ మినీ వేలంలో కుర్రాళ్లు సైతం భారీ ధర పలుకుతున్నారు. దేశవాళీ క్రికెట్‌లో దంచేస్తున్న.. వికెట్ల వేటతో రెచ్చిపోతున్న ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోటీశ్వరులను చేస్తున్నాయి. జమ్ముకశ్మీర్ పేసర్ అకీబ్ దార్ రూ.8.40 కోట్లు పలకగా.. ఉత్తరప్రదేశ్ కుర్రాడు ప్రశాంత్ వీర్ ఏకంగా రూ.14.20 కోట్లు కొల్లగొట్టాడు. మరో యంగ్‌స్టర్ కార్తిక్ శర్మను సైతం రూ.14.20 కోట్లకు దక్కించుకుంది చెన్నై సూపర్ కింగ్స్.

దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న కుర్రాళలు ఐపీఎల్ వేలంలో కోట్లు పలుకుతున్నారు. విధ్వంసక ఆటగాడైన ప్రశాంత్ వీర్ రూ.30 లక్షలతో వేలంలోకి రాగా.. అతడిని రూ.14.20 కోట్లకు పట్టేసింది చెన్నై సూపర్ కింగ్స్. అలానే వికెట్ కీపర్, బ్యాటర్ అయిన కార్తిక్ శర్మ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోటీపడిన సీఎస్కే చివరకు రూ.14.20 కోట్లకు దక్కించుకుంది. నిఖార్సైన రవీంద్ర జడేజా స్థానాన్ని వీరిలో భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే ప్రశాంత్, కార్తిక్‌లై చెన్నై ఫ్రాంచైజీ కోట్లు కుమ్మరించింది.

లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటరైన ప్రశాంత్ ఇటీవల యూపీ టీ20లో 155.34 స్ట్రయిక్ రేటుతో 320 పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించి 8 వికెట్లు కూల్చాడీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 112 రన్స్.. బంతితోనూ తిప్పేస్తూ 9 వికెట్లు పడగొట్టాడు. 19 ఏళ్ల కార్తిక్ ఇప్పటివరకూ టీ20ల్లో 12 మ్యాచుల్లో 162.93 స్ట్రయిక్ రేటుతో 334 పరుగులు సాధించాడు.

# పాపం పృథ్వీ షా.. ఈసారి కూడా ఎవరూ దేకలే!



**అబుదాబీ:** అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మినీ వేలం ఆరంభం అయింది. అబుదాబీ వేదికగా మంగళవారం మధ్యాహ్నం 2.30కు వేలం పక్రియ మొదలైంది. సెట్ 1 బ్యాటర్లలో ముందుగా ఆస్ట్రేలియా బ్యాటర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ వేలంకు రాగా.. ఏ ఫ్రాంచైజీ అతడిని కొనుగోలు చేయడనికి ఆసక్తి చూపలేదు. కనీస ధర రూ.2 కోట్లు అయినా అన్‌సోల్డ్‌గా మిగిలాడు. దక్షిణాఫ్రికా హిట్టర్ డేవిడ్ మిల్లర్‌ను కనీస ధర రూ.2 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది.

టీమిండియా ఆటగాడు పృథ్వీ షాకు ఐపీఎల్ 2026 మినీ వేలంలో నిరాశ ఎదురైంది. పృథ్వీ షా కనీస ధర రూ.75 లక్షలు కాగా.. అన్‌సోల్డ్ అయ్యాడు. పృథ్వీని కొనేందుకు ఏ ఫ్రాంచైజీ కూడా ముందుకు రాలేదు. ఐపీఎల్ 2025 వేలంలో కూడా పృథ్వీ అన్‌సోల్డ్ ప్లేయర్ అన్న విషయం తెలిసిందే. పేలవ ఫామ్, ఫిట్‌నెస్ సమస్యలతో భరత జట్టుకు దూరమయ్యాడు. దేశవాళీ టోర్నీలలో అడపాదడపా ఆడుతున్నా.. నిలకడగా ఆడడం లేదు. అందుకే ఫ్రాంచైజీలకు అతడిపై నమ్మకం పోయింది. వేలం చివరలో ఎవరైనా తీసుకుంటారో చూడాలి.

# ఐపీఎల్ వేలంలో జాక్‌పాట్ కొట్టిన పతిరణ...

**కలలో కూడా ఊహించని ధర**

**శ్రీలంక యువ పేసర్ మతీశ పతిరణకు భారీ ధర**

**రూ.18 కోట్లకు కొనుగోలు చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్**

**పతిరణ కోసం పర్సులో పెద్ద మొత్తాన్ని వెచ్చించిన కేకేఆర్**

**టిమ్ సౌథీ, డ్వేన్ బ్రావోల మార్గదర్శకత్వంలో ఆడనున్న పతిరణ**







**అబుదాబీ:** ఐపీఎల్ వేలంలో శ్రీలంక యువ పేసర్ మతీశ పతిరణ జాక్‌పాట్ కొట్టాడు. అతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీ ఏకంగా రూ.18 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. తన అసాధారణ బౌలింగ్ శైలితో గుర్తింపు పొందిన ఈ యార్కర్ స్పెషలిస్ట్ కోసం కేకేఆర్ తమ పర్సులోని అధిక మొత్తాన్ని వెచ్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ కొనుగోలుతో కోల్‌కతా బౌలింగ్ విభాగం మరింత పటిష‘ంగా మారింది. ఇప్పటికే జట్టుతో ఉన్న అనుభవజ్ఞులైన టిమ్ సౌథీ, డ్వేన్ బ్రావోల మార్గదర్శకత్వంలో పతిరణ ఆడనున్నాడు. వీరిద్దరి పర్యవేక్షణలో అతని నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

గత సీజన్లలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన పతిరణ, డెత్ ఓవర్లలో తన అదుతేమైన బౌలింగ్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు కేకేఆర్ తరఫున కూడా అదే ప్రదర్శనను పునరావృతం చేస్తాడని ఫ్రాంచైజీ యాజమాన్యం గట్టి నమ్మకంతో ఉంది. ఈ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాళ్లలో పతిరణ ఒకడిగా నిలిచాడు.

# MOVIE TIME




## వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్న కేరళ బ్యూటీ

**టాకీస్:** టీనేజ్‌లోనే హీరోయిన్‌గా కెరీర్ స్టార్ట్ చేసిన మలయాళ కుట్టీ అనశ్వర రాజన్ షార్ట్ టైంలోనే మాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైంది. సూపర్ శరణ్య, నేరు, గురువాయూర్ అంబలనడయిల్, రేఖా చిత్రం లాంటి సినిమాలు తెలుగులో కూడా మంచి వ్యూస్ సాధించాయి. మాలీవుడ్ డబ్బింగ్ సినిమాలతో పరిచయమైన అనశ్వర ఇప్పుడు డైరెక్ట్‌గా తెలుగు సినిమా వైపు ఫోకస్ పెంచుతోంది. అనశ్వర రాజన్ టాలీవుడ్ లో అచ్చమైన తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో రోషన్ హీరోగా తెరకెక్కుతున్న ఛాంపియన్ సినిమాలో చంద్రకళ అనే క్యారెక్టర్‌తో పరిచయం అవుతోంది. ఈ స్పోర్ట్స్ డ్రామాలో అనశ్వర పల్లెటూరి అమ్మాయిగా కనిపించబోతోంది. డిసెంబర్ 25న ఈ సినిమా రిలీజ్ కానుంది. తెలుగు ఆడియన్స్ ముందు అనశ్వరకు ఇదే అసలైన పరీక్ష. ఇటీవల మాలీవుడ్‌లో బిజీగా ఉండటంతో కోలీవుడ్ కు కాస్త గ్యాప్ ఇచ్చిన అనశ్వర ఇప్పుడు మళ్లీ తమిళ ఇండస్ట్రీని కూడా నెగ్లెక్ట్ చేయడం లేదు. డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా, సౌందర్య రజనీకాంత్ నిర్మాతగా తెరకెక్కుతున్న విత్ లవ్ లో అనశ్వర హీరోయిన్. ఈ సినిమాను నెక్స్ ఇయర్ ఫిబ్రవరిలో రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. అలాగే 7/జీ రెయిన్‌బో కాలనీ 2లోనూ నటిస్తోంది. దీన్ని తెలుగులో 7/జీ బృందావన్ కాలనీ 2గా రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఇక లేటెస్ట్‌గా అనశ్వర మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పింది. వెంకీ కుడుముల నిర్మాతగా మారి నిర్మిస్తున్న ఇట్లు అర్జునలో అనశ్వర హీరోయిన్‌గా నటిస్తోంది. ఇలా ఒకేసారి మాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్ వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తు స్టార్ హీరోయిన్ సరసన చేరేందుకు ప్రయత్నిస్తోంది అనశ్వర రాజన్.

## రౌడీ జనార్దన్‌గా వస్తోన్న విజయ్ దేవరకొండ



**టాకీస్:** విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవికిరణ్ కోల దర్శకత్వంలో 'రౌడీ జనార్దన్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈనెల 18న దిల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి విజయ్ డబ్బింగ్ పూర్తి చేసినట్లు తెలిసింది. ఇది కోనసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. దీంట్లో ఓ అందమైన ప్రేమకథ మిళితమై ఉంటుంది. విజయ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో అలరించనున్నారు.

## శివ రాజ్‌కుమార్, ఉపేంద్రల మల్టీస్టారర్ చిత్రం '45'



**టాకీస్:** కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45'. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా

వీఎఫ్ఎక్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం.

## నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు?

### నటి మెహరీన్ ఘాటు వ్యాఖ్యలు



**టాకీస్:** తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరీన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.

## 'ఓజీ' డైరెక్టర్ సుజీత్‌కు పవన్ కల్యాణ్ ఖరీదైన గిఫ్ట్.. ఆనందంలో దర్శకుడు

- 'ఓజీ' విజయంతో దర్శకుడు సుజీత్‌కు పవన్ కానుక
- లగ్జరీ రేంజ్ రోవర్ కారును బహుమతిగా అందజేత
- ఎక్స్ వేదికగా ఆనందం పంచుకున్న దర్శకుడు సుజీత్
- ఇది తాను అందుకున్న అత్యుత్తమ బహుమతి అని వెల్లడి



**టాకీస్:** ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తన 'ఓజీ' చిత్ర దర్శకుడు సుజీత్‌కు ఓ విలువైన బహుమతిని అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసిన సందర్భంగా సుజీత్‌కు లగ్జరీ కారును బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ ల్యాండ్ రోవర్ కంపెనీకి చెందిన రేంజ్ రోవర్ కారును ఆయన సుజీత్‌కు బహూకరించారు. చాలా కాలం తర్వాత పవన్ నుంచి బ్లాక్‌బస్టర్ విజయం అందడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్న వేళ, ఈ వార్త వారి ఆనందాన్ని మరింత పెంచింది. ఈ విషయాన్ని దర్శకుడు సుజీత్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా స్వయంగా పంచుకున్నారు. పవన్ కల్యాణ్ అందించిన బహుమతి పట్ల తన సంతోషాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

"నేను అందుకున్న బహుమతుల్లో ఇది అత్యుత్తమమైనది. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా, కృతజ్ఞతతో నిండిపోయాను. నా అత్యంత ప్రియమైన ఓజీ, కల్యాణ్ గారి నుంచి లభించిన ఈ ప్రేమ, ప్రోత్సాహం నాకు అన్నిటికంటే ముఖ్యం. చిన్ననాటి నుంచి ఆయన అభిమానిగా మొదలై ఈ ప్రత్యేక క్షణం వరకు ఇది నిజంగా అదుతేం. జీవితంలో ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను" అంటూ సుజీత్ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు.

## బోర్డర్-2 టీజర్ విడుదల




**టాకీస్:** 1997 నాటి ఐకానిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'బోర్డర్ 2'. ఈ సీక్వెల్‌లో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్‌జిత్ దోసాంజ్, అహన్ శెట్టి కీలక పాత్రల్లో నటిస్తుండగా.. ఈ సినిమాకు అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.

ఈ టీజర్‌లో బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ తన పాత మేజర్ కుల్‌దీప్ సింగ్ పాత్రలో తిరిగి కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.